# నరుడే నాయిక



రామవరపు వేణుగోపాలరావు

"అచ్చగా నాలాగే వున్నాడు కాని నా కుండే తోక మాత్రం లేదు' అంది కోతి.

"కళ్ళు నా కళ్ళ లాగే ఉన్నాయి అంది పిల్లి.

"ఆకారములో నేనే నయం'' అని నవ్వింది భల్లూకము.

'ఒంటిమీద వున్నదేదో నా చర్మంలా వుంది'' విస్మయంగా అంది జీబ్రా.

నిండు కొలువు తీర్చిన సింహం అన్నీ వింది. సింహానికి అటు ఏనుగులు-ఇటు చిరుతపులులూ వున్నాయి. భల్లూకాలూ, నక్కలూ, తోడేళ్ళూ, కాస్త పక్కగా దుప్పులూ, లేళ్ళ నిలబడి అంతా దీర్ఘంగా వింటూ మేత నెమరేస్తున్నాయి. చెట్లమీద కాకులూ, కొంగలూ, కోయిలలూ, పిచ్చుకలూ, పావురాలూ, గెద్దలూ, గుడ్లగూబలూ, రాబందులూ, నిశ్శబ్దంగా కూర్చున్నాయి.

"సరే, ఆ కొత్త జంతువు పేరేమిటి?' అంది సింహం దర్పంగా.

"అదే మాకు అర్థం కావడం లేదు.'' అన్నాయి అన్నీ ముక్తకంఠంతో.

సింహం కాసేపు దీర్ఘంగా ఆలోచించింది. ప్రక్కనున్న పులితోనూ, ఏనుగుతోనూ రహస్యముగా చర్చించింది.

"సరే-సభ్యులేం నిశ్చయించారో చెప్తే నేను ఒక నిశ్చయానికి వస్తాను'' అంది సింహం సమస్యని సభ్యుల ముందు పెడ్తూ.

"ఆ కొత్త జంతువుని మనలో కలుపుకుందాం. మన లోకానికి ఆహ్వానిద్దాం.'' అని ప్రతిపాదించింది నక్క. మిగతా జంతువులన్నీ ఆ ప్రతిపాదనని ఏకగ్రీ



లో-ఈ అడవి నీడలో మనం ఎన్నో ఏళ్లుగా ప్రశాంత జీవనం గడుపుతున్నాం. మనలో ఏ కలతలూ కార్పణ్యాలూ లేవు. ఇప్పుడా కొత్త జంతువు మంచి చెడ్డలు తెలుసుకోకుండా మన సంఘంలోకి ఆహ్వానించడం మంచిది కాదేమోనని నేను భావిస్తున్నాను.''

గుర్రం నెమ్మదిగా సకిలించింది. గాడిద చెవిలో ఏదో చెప్పింది. రెండూ నెమ్మదిగా మృగరాజుని సమీపించేయి. ''బాబూ, ఈ ముసలి నక్కకి ఎప్పుడూ అనుమానాలే. అదలా వుంచి, ఆ కొత్త జంతువుని మనం మనసారా నమ్ముదాం, అభిమానిద్దాం. మన సంఖ్యా బలం కూడా పెరుగుతుంది. మనకన్నా ఆ జంతువు తెలివిగలదైతే దాని సలహాలు ఆచరణలో పెడదాం. మన బ్రతుకు మెరుగు పర్చుకుందాం.'' అని అన్నాయి.

సింహం సాలోచనగా తలూపింది.

జంతువులూ, పక్షులూ మరోసారి ఆ ప్రతిపాదనని ఏకకంఠముతో బలపర్చేయి.

వంగా ఆమోదించేయి.

అంతలో ఓ ముసలి నక్క నెమ్మదిగా మృగరాజు దగ్గరికి నడిచింది చిన్నగా దగ్గి ఇలా అంది. ''మిత్రమా, చుట్టూ సముద్రం ఆవరించుకొనివున్న ఈ ద్వీపం

దీర్ఘంగా వూపిరి వదలి సింహం నిలబడింది.

''సరే, ఆ జంతు వెక్కడుంది?''

''సముద్రపు ఒడ్డునుంది. ఏదో దూలము

పట్టుకొని ఒడ్డుకివచ్చి అటూ ఇటూ తెగ చూస్తున్నాది. మన అరటిపళ్లు తెగ తింటున్నాది.!'

"సరే - సముద్రపు ఒడ్డుకి వెళదాం, పదండి," అంటూ మృగరాజు ముందు దారి తీసింది. మిగతా జంతువులు నేల మీదా-పక్షులు గగనమార్గంలోనీ సింహాన్ని అనుసరించేయి.

మధురమైన అరటిపళ్ళు తింటూ పక్షం రోజుల ఆకలి దప్పులు తీర్చుకుంటున్న నరుడు ఒక్కసారి తృళ్ళిపడ్డాడు. ముద్ద గొంతుకడ్డం పడింది. చప్పున లేచి నిలబడ్డాడు.

రెండు ఫర్లాంగుల దూరంలో సింహం వుంది. దాని వెనుక ఎన్నో క్రూర మృగాలు. అంతేకాదు అందులో ఆవూ మేక గొర్రెల్లాంటి సాధుజంతువులు కూడ వున్నాయి. కాస్త మీదుగా కొంగలు కాకులు గెద్దలు ఎగుర్తు వస్తున్నాయి. ఏం చేయాలో పాలుపోలేదు నరుడుకి. దగ్గర్లో కొబ్బరి చెట్టు పెన్నిధిలా కన్పించింది. కాళ్ళకి బుద్ధిచెప్పి గబగబ చెట్టెక్కేడు. చెట్టెక్కి కూర్చున్నాడే గాని నరుడి గుండెల్లో గుబులు తగ్గలేదు. కిందనున్న జంతువుల్లో భల్లూకం వుంది. కోతులు కూడ ఉన్నాయి. పాములూ ఉన్నాయి. ఇవి కాస్తా తనతోబాటే చెట్టెక్కి తనని స్వాహా చేస్తే! కడుపులో అరటిపళ్ళు వాంతి అయిపోయేట్టున్నాయి. తల తిరుగుతోంది.

"ఇదేమిటి ఈ జంతువు చెట్టెక్కిందేం"' అంది సింహం ఆశ్చర్యముగా.

"మనల్ని చూసి భయపడ్డట్టుంది. అందుకే చెట్టెక్కింది.' అంది ముసలి నక్క.

"సరే, భల్లూకమిత్రమా! నువ్వుపోయి చెట్టెక్కి ఆ కొత్త జంతువుని సగౌరవంగా తీసుకురా!'' అని ఆజ్ఞాపించింది మృగరాజు.

''ఒద్దు ప్రభూ, వద్దు! అలా చేస్తే అ జంతువు భల్లూకానికేదేనా ఆపకారము తలపెట్టొచ్చు. తనకై తానే దిగనివ్వండి.'' అంది నక్క ముక్కు చీదుకుంటూ.

"సరే - నీమాట ప్రకారమే కానీ!" అంటూ చతికిలబడింది, మృగరాజు మిగతా జంతువులుకూడ విశ్రాంతిగా చేరబడ్డాయి.

చెట్టుమీద నున్న నరుడు కాస్త సంబాళించుకున్నాడు. భయం కొంచెం తగ్గింది. కిందనున్న దృశ్యంచూసి బాగా ఆలోచించ సాగేడు.

పులిపిల్ల ఆవుపాలు తాగుతోంది. దూడా సింహం పిల్ల ఆటలాడుకుంటున్నాయి.

చిట్టెలుక మృగరాజు వీపుమీద ఎక్కి కూర్చుంది. మేకపిల్ల నక్క పొదుగు కుమ్ముతో ఆకలి తీర్చుకుంటోంది. ఓ చుంచెలక నాగుపాము పడగమీద ఠీవిగా కూర్చుంది. గెద్ద పక్కని కోడిపిల్లలు పావురాయిలూ కలకలమని చప్పుడుచేస్తూ తిరుగుతున్నాయి. సింహం ఉండుండి

తలెత్తి కొబ్బరి చెట్టుమీదకి చూస్తోంది.

చెట్టు దిగినంతవరకూ వీళ్ళిక్కడే వుంటారన్న నిశ్చయం చేసుకున్నాడ, నరుడు, దిగకపోతే తనకే ముప్పు అని కూడ నిర్ధారణ చేసుకున్నాడు. దిగినందు వల్ల వుపకారమే తప్ప అపకారము జరుగ దనుకున్నాడు కూడా! ఆ విధంగా అను కున్న వాడై నెమ్మదిగా కొబ్బరిచెట్టు దిగేడు.

"స్వా గ త ం! సుస్వాగతం!!" అన్నాయి జంతువులన్నీ.

"దయచెయ్యి...." అంటూ పక్షులు కమ్మగా పాడేయి.

కాసేపయ్యాక——

పిచుకలు గడ్డి తెచ్చి చెట్టుకింద మెత్తని పాన్పులేసేయి, ఆవు పాలు పితికి కొబ్బరి చిప్పలో నరుడి ముందు పెట్టింది కోతి. జీడిపప్పు - సెనగపలుకులూ- వెలగ పళ్ళూ తెచ్చి యిచ్చింది ఎలుగుబంటి: ఏను గులు తమ చెవులో నరుడికి గాలి వీచేయి ఫలహారం. చేశాక నరుడు నిలబడ్డాడు. దీర్ఘంగా త్రేన్చేడు.

"మహాశయా, నీలాంటి జంతువుని చూడడం ఇదే ప్రథమం. నువ్వెవరు? నీదే వూరు? ఇక్కడి కెలా వచ్చేవ్? సవివ రంగా చెప్పు!" అంది సింహం అప్యా యత వుట్టి పడ్తున్న కంఠంతో.

"మిత్రులారా, నేను నరుడిని నా దేశ ప్రభుత్వం వియత్నాంలోని యుద్ధభూమికి పంపింది. వెళ్తూ వెళ్తూ విమానం పాడ వడం వల్ల సముద్రములో పడిపోయేను. ఒక దూలం అదృష్ట వశాత్తూ దొరికింది. దాన్ని ఆసరాగా చేసుకుని ఇక్కడికి వచ్చాను. మీ చెలిమీ, మీ కలుపుగోలు తనమూ నాకెంతో నచ్చేయి. మీ అభి మానం నన్ను ముగ్ధుడిని చేసింది. చుట్టూ నీలిరంగు సముద్రం. తెల్లగా ఆకాశం, పచ్చగా ఫలవృక్షాలు ఈ ద్వీపం-ఈ అడవి మనోహరంగా వున్నాయి. నన్నిక్కడే మీతో బాటే జీవించే అవకాశము కలగ జేసినందుకు మీ అందరికి కృతజ్ఞుడిని." అంటూ వుపన్యాసం ముగించేడు నరుడు.

నరుడూ, జంతువులూ, పక్షులూ, కలిసి మెలసి సరదాగా కొంతకాలం జీవించేయి.

* * *

కొన్నాళ్ళకి ఆ ద్వీపంలో విచిత్ర మైన సంఘటనలు జరగడం మొద లెట్టాయి.

వుండుండి కోడిపిల్లలు మాయమవ సాగాయి. మేకపిల్లలూ అలాగే కన్పిం చడం లేదు చిట్టెలుకల సంఖ్య క్రమ ముగా తగ్గసాగింది. పులులు బలుస్తు న్నాయి. నక్కలు నాలికలు తడి అర్చుకో టానికి శ్రమపడుతున్నాయి. కొత్తరకం రుచిని చిరుతలు కలలో కూడా గుర్తుకి తెచ్చుకొని లొట్టలు వేయసాగాయి.

మరి కొన్నాళ్ళకల్లా——

ఆవులన్నీ ఒక సంఘంగానూ. మేకలూ - గొర్రెలూ - దున్నలూ - లేళ్ళూ మరో సంఘంగానూ ఏర్పడ్డాయి, కప్పలూ

ఎలుకలూ - చిట్టెలుకలూ వేరె సంఘం స్థాపించుకున్నాయి. పాములు, తేళ్ళూ మరో సంఘం అయ్యేయి పక్షులు కూడా వేరే వేరే సంఘాలు స్థాపించుకున్నాయి. పులులూ-సింహాలూ-చిరుతలూ వేరే సంఘం. నక్కలూ-భల్లూకాలు మరో సంఘం....ఇల్లా చెల్లా చెదరయ్యాయి. సఖ్యత లోపించింది. పరసంఘ పక్షుల సహనం లోపించింది....సంఖ్య కూడ తరగసాగింది.

మరికొన్నేళ్ళకి—

పాములు పుట్టల్లో దాక్కోసాగేయి. నక్కలు బొరియల్లో దూరేయి. తుపాకి దెబ్బతిన్నవి చావగా మిగిలిన సింహాలూ-పులులూ బోనుల్లో ఇరుక్కున్నాయి. ఆవుల మెడలకి తాళ్ళు, వాటి పాలు నరులకి ఆహారం అయింది. మేకలు గొర్రెలు బలవంతంగా చంపబడి నరుల డైనింగ్ టేబిళ్ళ మీదకి ఎక్కేయి.

దీంతో సరా—

ఆ అడవిలో జంతు సంఖ్య తరిగింది నరులసంఖ్య పెరిగింది.

అంతేకాదు—

వాళ్ళలో కూడ పార్టీలు పెరిగేయి. గ్రూపులు చెలరేగేయి. జాతులు మతాలు ఎన్నెన్నో ఏర్పడ్డాయి ఓట్లు వచ్చేయి. నోట్లూ వచ్చేయి.

దోపిళ్లు మొదలయ్యేయి.

మానభంగాలు ప్రారంభమయ్యేయి.

యుద్ధాలూ రాసాగేయి.

సినిమా లొచ్చేయి.

వ్యభిచార గృహాలొచ్చేయి.

హోటళ్లు వచ్చేయి.

ఇంతెందుకు, నాగరికత వచ్చేసింది.

ప్రజాస్వామ్యం, ధనికవాదం, కమ్యూనిజం అంటూ నినాదాలు మొదలయ్యేయి.

దేవుళ్లు దెయ్యాలు బాబాలు పీఠాలు వెలిసేరు.

ఎక్కువ్వాళ్ళూ తక్కువ్వాళ్ళూ వేరు వేరయ్యేరు. బలవంతులూ బలహీనులూ ఏర్పడ్డారు.

ఇకనేం—

మారణహోమం మొదలైంది.

ఇంకేముందీ కథ?

అంతా షరా మామూలే!!

## వాటేపిటీ

'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ' లో మిడ్‌వైఫరీగురించి నలభై పేజీలూ, అణువు(Atom) గురించి కేవలం ఒకపేరామాత్రమే కేటాయించారు.